క్లుప్తంగా

డీఎస్పీకి శుభాకాంక్షలు



డీఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ డీఎస్పీ సైదాను బుధవారం గిరిజన సంక్షేమ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. జహీరాబాద్ డీఎస్పీగా సైదా ఇటీవలే పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్



సామయ్య నివాసంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

పటాన్‌చెరు టౌన్: ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సామయ్య ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ క్రమంలో బుధవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.

పోలీసుల అదుపులో మతిస్థిమితం వ్యక్తి



కల్హేర్(నారాయణఖేడ్): పాపం.. ఇతను ఎవరో ఎక్కడి నుంచి వచ్చాడో తెలియడం లేదు. మతిస్థిమితం సరిలేక తిరుగుతున్నాడు. బుధవారం పోలీసులు పెట్రోలింగ్ కోసం తిరుగుతున్న క్రమంలో వారి కంటపడ్డాడు. సిర్గాపూర్ మండలం గౌడ్‌గాం చౌరస్తా నుంచి వంగ్దల్ చౌరస్తా వైపు కాలినడక వెళ్తుండగా అనుమానంతో పోలీసులు వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. మాట్లాడకుండా మౌనంగా ఉన్నాడు. పోలీస్‌స్టేషన్ తీసుకువచ్చి తప్పిపోయాడా? మిస్సింగ్ కేసా? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. యువకుడికి 25 ఏళ్ల వయస్సు ఉంటుందని ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఎవరైనా గుర్తుపడితే ఫోన్: 8712656759, 8712661857కు సమాచారం ఇవ్వాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మునిపల్లి(అందోల్): సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని హెడ్‌కానిస్టేబుల్ గోపాల్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కంకోల్‌లో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అపరిచితుల ఫోన్లు లిఫ్ట్ చేయొద్దని, బ్యాంకు అకౌంట్ నంబర్ అడిగితే చెప్పొద్దని సూచించారు.

గడ్డపోతారంలో దొంగల బెడద



సీసీ టీవీకి చిక్కిన దుండగుడు

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో రాత్రి వేళల్లో దొంగల బెడదతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కొంతకాలంగా మున్సిపల్ వీధుల్లో ఇంటి బయట విలువైన వస్తువులు, ఇతర సామగ్రిని మటుమాయం అవుతున్నాయి. పారిశ్రామిక ప్రాంతం కావడంతో ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ఇక్కడ నివసిస్తుంటారు. ఎవరో గుర్తించలేని పరిస్థితి నెలకొంది. గ్రామపంచాయతీ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిర్వహణ లేక పని చేయడం లేదు. దానికి తోడుగా పోలీసుల నిఘా లేకపోవడంతో అదునుగా భావించిన దుండగులు మంగళవారం రాత్రి ఓ ఇంటి ఆవరణలో సంచరిస్తుండగా సీసీ టీవీలో రికార్డ్ అయింది. పోలీస్ అధికారులు క్షేత్రస్థాయిలో నిఘా ఏర్పాటు చేసి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సాగుకు తొందరొద్దు

- ముఖం చాటేసిన వర్షాలు
- వారం క్రితమే విత్తిన పత్తి విత్తనాలు
- అదును ప్రకారం విత్తుకోవాలంటున్న అధికారులు



పత్తివిత్తనాలు వేస్తున్న రైతులు

రాయికోడ్(అందోల్): సాధారణం కన్న భిన్నంగా ఈ ఏడాది రుతుపవనాలు ముందస్తుగా ప్రవేశించడంతో జిల్లా వ్యాప్తంగా మే చివరి వారంలో అడపాదడపా వర్షాలు కురిశాయి. ఎంతో ఆశగా రైతులు పత్తి విత్తనాలు వేసే పనులు ప్రారంభించారు. రాయికోడ్, మునిపల్లి, వట్‌పల్లి తదితర మండలాల్లోని పలువురు రైతులు వారం రోజుల క్రితమే తొలకరి వర్షాలు కురవగానే పత్తి విత్తనాలు విత్తారు. పత్తిసాగులో గత ఏడాది రైతులు ఆశించిన దిగుబడి పొందలేదు. ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో ఇప్పటికే పత్తివిత్తనాలు వేసే పనులు కొనసాగుతుండగా ఆదిలోనే వర్షాలు ముఖం చాటేయడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నెల11న పత్తి విత్తనాలు వేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో ఈ ఏడాది సుమారు 3.80 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేసే అవకాశం ఉంది. రైతులు అదునుకు అనుగుణంగా పత్తి విత్తనాలు వేసుకోవాల్సిన అవసరం ఉంది. గతంలో ముందస్తుగా పత్తి విత్తనాలు వేసి వర్షాలు కురవకపోవడంతో రైతులు రెండోసారి విత్తనాలు వేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో పెట్టుబడులు అధికమైన సందర్భాలు ఉన్నాయి. ఈ క్రమంలో పంటల సాగుకు తొందరొద్దని, తమ సూచనలు పాటించి విత్తనాలు తగిన ఎరువులు వేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు చెబుతున్నారు.

వాతావరణం చల్లబడలేదు..



రుతుపవనాలు ముందస్తుగానే ప్రవేశించినా వాతావరణం ఇంకా చల్లబడలేదు. ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతున్నాయి. గత నెలలో వర్షాలు కురిసినా ప్రస్తుత ఎండలతో నేలలో తగిన తేమ లేదు. పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు పత్తి విత్తనాలు విత్తుకునేందుకు తొందరపడొద్దు. ఈనెల 11 తేదీ నుంచి పుష్కలంగా వర్షాలు కురిస్తే విత్తనాలు వేసుకోవాలి. ఎరువులు తగిన మోతాదులో వినియోగించాలి.

– సత్యనారాయణ, ఏడీఏ రాయికోడ్

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పండరి

జహీరాబాద్ టౌన్: ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సాహిస్తోందని ఉద్యానశాఖ అధికారి పండరి అన్నారు. మండలంలోని బాబానగర్‌లో బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వ్యవసాయ శాఖ ఏడీఏ భిక్షపతి, ఏఓ లావణ్య, ఏఓఏ ప్రదీప్ కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పండరి మాట్లాడుతూ.. తక్కువ నీటితో ఉద్యాన పంటలను సాగు చేయొచ్చన్నారు. సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ కింద పండ్ల తోటల సాగుకు 50 శాతం సబ్సిడీ, కూరగాయలు, పూల తోటలకు సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. మల్చింగ్‌కు 50 శాతం, కల్టివేటర్ కూడా సబ్సిడీ ఇస్తామన్నారు. బిందు సేద్యం చేసేందుకు అవసరమైన పరికరాలకు ప్రభుత్వం రాయితీలు ఇస్తుందన్నారు. వెదురు మిషన్ ద్వారా వెదురు సాగుకు కూడా సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. ఆయిల్ ఫాం సాగు పెద్ద మొత్తంలో సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంట మార్పిడి తప్పనిసరి

శాస్త్రవేత్త తబస్సుమ్ పాతీమా



కార్యక్రమంలో మాట్లాడుతున్న పాతీమా

న్యాల్‌కల్(జహీరాబాద్): రైతులు వేసిన పంటలు మళ్లీ వేయకుండా పంట మార్పిడి చేయాలని జయశంకర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త తబస్సుమ్ పాతీమా సూచించారు. రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని హద్నూర్ రైతు వేదికల్లో పంటల సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నిసార్లు చెప్పినా చాలా మంది రైతులు వేసిన పంటలనే మళీమళ్లీ వేస్తూ సరైన దిగుబడులు రాక నష్టపోతున్నారని అన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడడం వల్ల లాభాలకంటే నష్టమే ఎక్కువ జరుగుతుందన్నారు. నీటిని వృథా చేయకుండా డ్రిప్ విధానం ద్వారా పంటలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త హరికుమార్, ఏఈఓలు రమేష్, మాదవితో పాటు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



ప్రధానోపాధ్యాయుడు చంద్రప్రకాష్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. బుధవారం పెద్దశంకరంపేట ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గజ్వాడ చంద్రప్రకాష్ పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని చెప్పారు. విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మెదక్ డీఈఓ రాధాకిషన్, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, జిల్లా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్, సీడీపీఓలు జయరామ్‌నాయక్, పద్మలత, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఏఎస్ఓ నవీన్, గోపి, శ్రీనివాస్, రామచంద్రాచారి, ప్రసన్నకుమార్ తదితరులు ఉన్నారు.

మందిరం నిర్మాణానికి స్థలం పరిశీలన

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్ణాపూర్ మెట్టుకుంట తండాలో భవాని మాత సేవాలాల్ మహరాజ్ మందిరం నిర్మాణానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి బుధవారం స్థలం పరిశీలించారు. తండావాసులతో మాట్లాడి మందిరం పనులు పూర్తి చేసేందుకు సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తుకరాం, దేవదాస్ పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం కృషి

నారాయణఖేడ్: గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. పట్టణ శివారులో బుధవారం సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం నుంచి 130 గిరిజన తండాలకు రూ.3.500ల చొప్పున ఆర్థిక సహాయం విడుదల కావడంతో పూజారులకు అందిస్తున్నామన్నారు. ఖేడ్‌లోని రాంరావు మహరాజ్ ట్రస్టుకు కేటాయించిన స్థలంలో భవ్యమైన భవనం నిర్మాణానికి రూ.2కోట్లు అవసరమని, ఈ విషయాన్ని సీఎంకు నివేదించగా సానుకూలంగా స్పందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమాధికారి అఖిలేష్ రెడ్డి, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. బుధవారం వారిని కోర్టులో హాజరు పరచగా ఆరుగురికి రూ. వెయ్యి, మరోఆరుగురికి రూ.1500 చొప్పునా జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

జహీరాబాద్ టౌన్: మహేశ్వరీ సమాజం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో రక్తాదాన శిబిరం నిర్వహిచారు. సమాజం సభ్యులు, యువకులు 79 యూనిట్ల రక్తాన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి ఇచ్చారు. సంఘం సభ్యులు మాట్లాడుతూ.. సంఘం ఆధ్వర్యంలో విద్యా, వైద్య రంగాల్లో నిస్వార్థంగా సేవలు అందిస్తున్నామని చెప్పారు.

తడి పొడి చెత్తపై అవగాహన

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వ ఆదేశాల మేరకు బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నా రు. బుధవారం నగర పరిధిలోని పలు వార్డుల్లో కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారు లు, సిబ్బంది ఇంటింటికి వెళ్లి మహిళలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. కంపోస్ట్ ఎరువు తయారీలో తడి చెత్త ఆవశ్యకతను వివరించారు. అనంతరం ఇంటి పైకప్పుపై ఓ దంపతులు నిర్వహిస్తున్న సేంద్రియ వ్యవసాయాన్ని పరిశీలించారు. కూరగాయ పంటలు పూలు పండ్లు పండిస్తున్న విధానాన్ని అభినందిస్తూ కమిషనర్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఈ కిష్టయ్య శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ మున్సిపల్ సిబ్బంది సునీత మెప్మా మహిళలు పాల్గొన్నారు.



దంపతులను సన్మానిస్తున్న కమిషనర్

కానరాని పీసీబీ అధికారుల జాడ



వాగులోకి విడుదల చేసిన రసాయన వ్యర్థాలు

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం పారిశ్రామిక వాడలో పరిశ్రమల నుంచి రసాయన వ్యర్థాలు విచ్చలవిడిగా బహిరంగ ప్రదేశాల్లోకి విడుదల చేస్తున్నారని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామికవాడలోని విష్ణు కెమికల్ పరిశ్రమ వెనక భాగం నుంచి వాగులోకి మంగళవారం పెద్ద ఎత్తున రసాయన వ్యర్థ విడుదల చేశారు. గతవారం పసుపు పచ్చరంగు వ్యర్థాలు, ప్రస్తుతం నల్ల రంగులో వ్యర్థాలు విడుదలయ్యాయి. దీంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. విష్ణు కెమికల్ పరిశ్రమ తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా నిర్లక్ష్యాన్ని వీడి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాగే కొనసాగితే కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

బిల్లులు భద్రపరుచుకోండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న హేమలత

జిన్నారం (పటాన్‌చెరు): విత్తనాలు పురుగుల మందులు కొనుగోలు చేసిన బిల్లులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త హేమలత రైతులకు సూచించారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని రామ్‌రెడ్డి బావి గ్రామంలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో చేపట్టిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఫెర్టిలైజర్ షాపులలో కొనుగోలు చేసిన తర్వాత బిల్లులను భద్రపరుచుకోవాలని సూచించారు. సాగు వ్యయం, యూరియా వినియోగం తగ్గించుకునే మార్గాలను వివరించారు. విత్తనాలను ప్రభుత్వ రంగ సంస్థలు లేదా వర్సిటీల నుంచి కొనుగోలు చేయడం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు ప్రణవి, వర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థి హిమాకుమార్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

జెడ్పీ డిప్యూటీ సీఈఓ స్వప్న



హాజరు పట్టికను పరిశీలిస్తున్న స్వప్న

కంది(సంగారెడ్డి): ఉద్యోగులందరూ సక్రమంగా విధులు నిర్వహించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ స్వప్న సూచించారు. బుధవారం కంది ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ హాజరు పట్టికను పరిశీలించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా మండలంలోని బేగంపేటలో జెండాను ఉపాధి హామీ కాంట్రాక్టు ఉద్యోగి ఆవిష్కరించడంపై వివరాలు అడిగి తెలుసుకుని ఇక ముందు అలా జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్ వేణుగోపాల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



పట్టుబడిన పశువుల లారీ

వట్‌పల్లి(అందోల్): పశువులను అక్రమంగా తరలిస్తున్న ఓ లారీని వట్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. నారాయణఖేడ్ నుంచి పశువులను లారీలో హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో బజరంగ్‌దళ్, విశ్వహింద్ పరిషత్ సభ్యులు కారులో వెంబడించి వట్‌పల్లి వద్ద అడ్డుకోని స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పశువుల అక్రమదారులు బజరంగ్‌దళ్ సభ్యులు మధ్య ఘర్షణ చోటు చేసుకోగా బజరందళ్ సభ్యుడికి గాయాలయ్యాయి. కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు లారీని తనిఖీ చేయగా 21 మగదూడలను తాళ్లతో కట్టేసి నీరు, ఆహారం లేకుండా రవాణా చేస్తున్నారు. దీంతో దూడలను గోశాలకు తరలించారు. పశువైద్యాధికారి దివ్య పశువులను పరీక్షించగా 2 సంవత్సరాల వయస్సు కలిగిన మగదూడలుగా ధ్రువీకరించారు. ఇమ్రాన్, జాఫర్, ఇలియాజ్, మోయిన్, మజర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మురుగు పరుగు



రహదారి పక్కన ప్రవహిస్తున్న మురికినీరు

సంగారెడ్డి జోన్: అధికారుల నిర్లక్ష్యం, పట్టింపు లేనితనంతో రహదారి పక్కనే మురికి నీరు పారుతోంది. సంగారెడ్డి పట్టణంలోని ప్రధాన రహదారి మార్కెట్ యార్డు దాటగానే రోడ్డు పక్కన మురికి కాలువ నిండి రోడ్డు వెంట ప్రవహిస్తోంది. అక్కడే క్యాబ్ వాహనాలు నిలిపి ఉంటాయి. భరించలేని కంపు వాసనతో నిత్యం డ్రైవర్లతో పాటు రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. గంటల పాటు డ్రైవర్లు అక్కడే ఉండటంతో రోగాల బారిన పడాల్సి వస్తుందని చెబుతున్నారు. నిత్యం ఈ దారి గుండా జిల్లా ఉన్నతాధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. అయినా పట్టించుకోవటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

వార్డుల పునర్విభజనకు నోటిఫికేషన్

ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి

పటాన్‌చెరు టౌన్: నూతనంగా ఏర్పడిన ఇస్నాపూర్ మున్సిపాలిటీలో వార్డుల విభజన, ఓటర్ల నమోదుకు నోటిఫికేషన్ విడుదలైనట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీహరి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వారం రోజుల్లో డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేసి, ముసాయిదా జాబితాను ప్రచురిస్తామన్నారు. ప్రజల నుంచి సలహాలు, సూచనలు, ఫిర్యాదులను తీసుకుని వాటిని పరిష్కరించి తుది జాబితాను ప్రచురిస్తామని ఆయన తెలిపారు. ఇస్నాపూర్ పరిధిలో 12 వార్డులు, చిట్కుల్ 07 వార్డులు, పాశమైలారం 03 వార్డులున్నాయని ఆయన తెలిపారు. వార్డుల్లో నివాస గృహాలు, జనాభా, కులాల వారీగా స్త్రీలు, పురుషులు ఓటర్ల వివరాలను గెజిట్లో వెల్లడిస్తారని ఆయన పేర్కొన్నారు. ఇందుకనుగుణంగా మున్సిపల్ నుంచి సర్వే జరుగుతుందని చెప్పారు.

జహీరాబాద్: అదేవిధంగా కొత్తగా ఏర్పాటైన కోహీర్ మున్సిపాలిటీలో వార్డుల విభజనకు గాను నోటిఫికేషన్ జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రమేశ్ తెలిపారు. మున్సిపాలిటీలో 10,859 మంది ఓటర్లు ఉన్నారు. జనాభాకు అనుగుణంగా 16 వార్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటి నంబర్ల ఆధారంగా పట్టణంలో కొత్త వార్డులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నోటిఫికేషన్‌కు సంబంధించి ప్రజలకు ఎలాంటి అభ్యంతరాలున్నా ఈ నెల 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.



కోహీర్ పట్టణం

భూభారతిని సద్వినియోగం చేసుకోవాలి

ఆర్డీఓ రాంరెడ్డి



న్యాల్‌కల్: మాట్లాడుతున్న ఆర్డీఓ రాంరెడ్డి

న్యాల్‌కల్, (జహీరాబాద్): ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ ఆర్డీఓ రాంరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రుక్మాపూర్, గంగ్వార్ గ్రామాల్లో బుధవారం భూభారతి సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములకు సంబంధించి ఏ సమస్య ఉన్నా తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. సాధ్యమైనంత వరకు అక్కడే పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. రైతులు తమ సమస్యలను తెలియజేస్తే అధికారులే దరఖాస్తులను పూర్తి చేసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ రాజిరెడ్డి, ఇతర అధికారులు రైతులు పాల్గొన్నారు.

మండలంలోని అంకేనపల్లిలో..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రెవెన్యూ సదస్సులతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించుకోవచ్చని సంగారెడ్డి ఆర్డీఓ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అంకేనపల్లిలో రెవెన్యూ సదస్సును సందర్శించి దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రజల వద్దకే అధికారులు వచ్చి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. పాస్‌పుస్తకంలో పేరు మార్పులు, ఆన్‌లైన్ సమస్యలు, పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ బాలరాజ్, ఆర్ఐ అనంతయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సిర్గాపూర్ మండలం చీమల్‌పాడులో..

కల్హేర్(నారాయణఖేడ్): రెవెన్యూ సదస్సులతో భూసమస్యలు పరిష్కరించనున్నట్లు నారాయణఖేడ్ ఆర్డీఓ అశోక్ చక్రవర్తి తెలిపారు. బుధవారం సిర్గాపూర్ మండలం చీమల్‌పాడులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు పరిశీలించి అర్హత ఉంటే పరిష్కరిస్తామని తెలిపారు.

దరఖాస్తు చేసిన వారంలో పరిష్కరిస్తాం

పటాన్‌చెరు: మండలంలోని రామేశ్వరంబండ, బచ్చుగూడెం గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూభారతిపై అవగాహన కల్పిస్తున్నా రైతులు సమస్యలను పరిష్కరించేందుకు పెద్దగా రావడం లేదు. రామేశ్వరంబండ పంచాయతీలో 50 దరఖాస్తు ఫారంలు పంచగా, కేవలం 10 మంది మాత్రమే సమస్యలను తెలుపుతూ దరఖాస్తులు ఇచ్చారు. అలాగే, బచ్చుగూడెంలో నిర్వహించిన సదస్సుకు 25 దరఖాస్తులను పంపిణీ చేయగా కేవలం రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ రంగారావు మాట్లాడుతూ.. దరఖాస్తు చేసిన వారంలోపు వారి సమస్యను పరిష్కరిస్తామన్నారు. తమ పరిధిలో లేని సమస్యలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జ్యోతి, మాజీ ఎంపీటీసీ అంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.